కథానిక

# బలహీనుడు

రాత్రి భోజనమయ్యాక జనార్దనరావు ఆరు బయట మంచంవాల్చుకుని పడుకున్నాడు, అంతలో వాళ్లనాయనమ్మ వచ్చి "ఏరా జనా! అమ్మాయిదగ్గరకు 'వెళ్లిరావటరా?" అంటూ కాళ్ల ప్రక్క చతికిలబడింది. హఠాత్తుగా అడిగినప్రశ్నకు కొంచం తబ్బిబ్బయి "యిప్పుడెందుకే" అనేశాడు. "ఎందుకేమిటిరా! ఒకసారి వెళ్లి చూచిరా నాయనా" ఎంతో అనునయంగా చెప్పింది. సానుభూతికూడా ఒకప్రక్క తొంగిచూచింది. ఆశ్చర్యపోయాడు. ఎందుకోసిగ్గు నెట్టుకొచ్చింది. తన మీదో, భార్యమీదో ఈ సానుభూతంతా తెలియకుండావుంది. యిద్దరమీదానేమో అనిపించింది. అక్కడ తన భార్య బాగానేవుందికదా? ఒకవేళ చూచిరావాలేమో! అక్కడ నుంచి వచ్చి తను నెలరోజులు పయినయింది. అంతా తమాషాగా వుంది. ఏ దెట్లున్నా బామ్మ మాట్లాడుతుంటే కరుణ పుట్టిపడుతుంది. "రేపు మంచిరోజురా; నెల పొడుపుకూడాను! మనవరాలినిచూచిరా" అంటూ తాతయ్యవచ్చి మడతమంచం వాల్చుకొన్నాడు. "సరేలేవే" అన్నాడు జనార్దనరావు. రేపు ప్రయాణం గూర్చి—తన భార్య తనకేవిధంగా ఆహ్వానిమిస్తుందో తలుచుకుంటూ నిద్రపోయాడు.

మరునాడు వాళ్లమ్మ "అత్తవారింటికి వెళ్లి రారాదూ? ఇవ్వాళ మంచిదికూడానూ." అన్నది "సరే" అని సన్నాహమవుతున్నాడు. నాయనమ్మవచ్చి "మొన్న వాళ్లుపెట్టిన జరీపంచె, లాల్చి తొడుక్కోరా! జమీందారులా వుంటావు" అన్నది. తనకు సరీగ్గా పంచెకట్టుకోవటం చాతకాదే! రెండేళ్ల క్రితమెప్పుడో వాళ్ల మేనమామ భార్య కట్టింది. వాళ్లమ్మగారు పంచెలు పెడితే నడక చేతకాకపోతే గంటముందే విడిచివేసి సంచిలో తోసేవాడు. నవ్వువచ్చింది. 'అయినా చూద్దాం; బాగులేకపోతే అప్పుడే విడిచివేయవచ్చు' అనుకుంటూ డ్రాయరుపయిన జరీపంచె, కట్ బనీను మీద సిల్కు లాల్చీ—నిలువుటద్దంముందు తనలో తాను ఊహించుకోకముందే "మహారాజు బిడ్డలా వున్నావురా! చెప్పితే వినవుగాని—యికనైనా ఆపంట్లాములు మానివేయరా" అంటూ నాయనమ్మ వచ్చింది. తనలోతాను నవ్వుకుంటూ చరచరా చెల్లెలుదగ్గరకు దాదాపు పరుగెత్తుకుంటూ వెళ్లాడనుకోవచ్చు. ఎలావుందని అడక్కముందే చెల్లెలు "అచ్చంగా ముసలి పెళ్లికొడుకులా వున్నావు" అంది. తనకి ఆమాటతో చచ్చినంత పనయింది. వెనక్కుతిరిగి అద్దంముందు నిలబడితే "నిజమే" అనిపించింది. "దానిముఖం, దానికేమి తెలుసు? దానిమొగుడు బక్కగా, బారుగావుంటాడు; అతనికి బావుండదని—నీకు బాగావుండదా? బంగారంలా వుంటేనూ" అంటూ మనువరాలిని నాలుగుతిట్టి విడవొద్దని బ్రతిమాలింది. మళ్లీ చూచుకున్నాడు అద్దంలో. ఈసారి "ఫరవాలేదు — ఏమంత అసహ్యంగా లేను!" అనిపించింది, ఎలావున్నా యిట్లాగే వెళ్ళాలనుకున్నాడు. ఈసారి చూచుకున్నాడు. బాగానేవుం దతనికి. అంతలోవాళ్ళమ్మ వచ్చి "బాగానే వుంది పగటివేషం" అంటూ పెదవి విరిచింది. చెల్లెలు కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వింది. వాళ్ళమ్మకూ తనకూ అసలు అభిప్రాయాలు కుదరవు. అంతలో వాళ్ళ బామ్మ వచ్చి "నోడుముయ్యాయ్, ఎవరన్నా నవ్వుతారు" అంటూ గద్దించింది కోడల్ని.

అలాగే ప్రయాణానికి సన్నాహమయ్యాడు; వాకిట్లో నల్లపిల్లి ఎదురైంది. చివుక్కుమంది లేత మనస్సు. చుట్టూ తిరిగిపోయినట్లుం దతనికి. కళ్లు తెరిచే ఎటూ చూడకుండా బయలుదేరాడు. పిల్లినేమో తిట్టుకున్నాడు. చచ్చినట్లు నాలుగు మైళ్ళు బస్సుదగ్గరకు చేరుకొనేప్పటికి చూపు మేరలో బస్సు కదలబోతోంది. "చచ్చాంరా దేవుడా" అనుకుంటూ — పరుగెడదామంటే ఈ బట్టలతో చూసి నవ్వుతారేమోనని జంకి మామూ

దండమూడి బాలగంగాధరరావు

లుగా నడవసాగాడు. పరుగెడితే అందుతుంది మరి. బస్సు బయలుదేరింది. అదృష్టవశాత్తూ ఎందుకో బస్సు ఆగటం-టిక్కట్టు దొరకటంతో మనస్సు కుదుటపడింది. వెధవ నమ్మకాలనుకున్నాడు. యింటిముందు పిల్లి గుర్తొచ్చి నాయనమ్మ ఆగి వెళ్లమంది. తను అటువంటివే పట్టించుకోడు. తను చేసిన పనికి తనే గర్వపడ్డాడు నిజంగా పిల్లి అని ఆగితే ఈ బస్సు దాటిపోయేది పూర్తిగా - మళ్ళీ మూడుగంటల తర్వాతగాని బస్సు లేదనుకొన్నాడు.

సాయంకాలం అయేసరికి మధ్యలో రెండు బస్సులు మారి బస్తీ చేరుకున్నాడు. అక్కడనుంచి వాళ్ల త్తవారూరు అయిదు మైళ్లు. కారురూటు వుంది సాయంకాలమయితే దగ్గరటిక్కట్లివ్వరు. "బస్సుస్టాండు" అంతా కిటకిటలాడుతూంది ప్రయాణీకులతో కళకళలాడుతూందికూడా——పువ్వులు, పళ్లు, పుస్తకాలు వింతవింత వస్తువులతో... తను నడవలేకపోతున్నాడు. అంతా తననే చూస్తున్నారనుకుంటున్నాడు. పక్కవాళ్లు చూస్తారు నిజమే. వింతగావుంటే, మరి చూస్తారు. కొత్తగానడిస్తే అంతా చూస్తారు. అంతపనీ అయిందనుకుంటున్నాడు. అనుకుంటున్నారనే భయంతో నిలువునా క్రుంగిపోతున్నాడు. వెధవపంచె! ఒకప్రక్క క్రిందికి పడుతూంది చెంగు. అది సర్దుకొనేటప్పటికి రెండవ వైపు నేలకాస్తూంది. మరోప్రక్క ప్రేక్షకుల తీవ్ర వీక్షణాలు, ముందుకు అడుగువేయలేడు. నిలబడదామనుకుంటూంటే నడుస్తూన్నాడు; నడుద్దామనుకుంటే నిలబడిపోతున్నాడు. వాళ్లంతా అతన్ని హాస్యంగా చూస్తున్నారనుకున్నాడు. ఇంకేముంది గుండె బ్రద్దలవుతూందా అనిపించింది. ఎదురొమ్ము వంగిపోతూంది. తలదించుకుపోయింది. నుంచున్నాడు స్థంబంచాటుగా "ఛా! సరిగ్గా నుంచోవాలి" అనుకున్నాడు. ధైర్యంతో నుంచున్నాడు. నిల్చోడం కూడా చాలాబాధగా, బరువుగా వుందతనికి నిలువలేకపోతున్నాడు.

బస్సు కనిపెట్టడానికి పదినిమిషాలు పట్టింది. యింతకీ అసలది ఎదురుగుండానే దివాళా తీసినట్లు ఖాళీగావుంది. ఒక్కడు కూడా లేడు బస్సులో. అంతలో "1955 కేలండర్స్ కేలండర్స్" అంటూ ఎదురుగా నిలబడి ఎగాదిగాచూసి ఒకటే వాగుడు. తననే అడుగుతున్నా డనుకున్నాడు. బస్సుదగ్గరకు వెళ్ళబోయేవాడు ఆగిపోయాడు—"వీడికిజడిసి వెళుతున్నాడు." అనుకుంటారేమోనని వాడింకా కదలలేదు. వాడు చిరునవ్వుతో దగ్గర కొచ్చి "ఏమండీ రకరకాల నవల్స్వుండయి——పగటిచుక్క, రేచుక్కలాంటి పుస్తకాలండి. పొదలో గుసగుసలు—పెదిమవిరుపులు—విరహవేదనలు చాలావుండయ్యండి." అంటూ అదోరకంగా చూచాడు. ఓరి వీడిదుంపతెగ! కాలం డర్స అన్నాడు యివన్నీ ఎక్కడివి, వీడిచేతిలో అనుకుంటూ వాడిచేతిమీదికి మరలించాడు దృష్టిని లను. "పుస్తకాలు ప్రక్కకొట్టులో వుండయ్యండి! ఒకసారి దయచేస్తారా?" అంటూ జవాబుకై ఎదురుచూచాడు. వెధవ! చనువిస్తే లాక్కెళ్లేట్టున్నాడు! అనుకుంటూ "అక్కరలేదు లేవయ్యా! కావాలంటే వచ్చేవాణ్ణిగా!" అంటూ లేనికోపాన్ని తెచ్చుకున్నాడు. వాడు దగ్గరకొచ్చి తలగోక్కుంటూ నెమ్మదిగా "కొక్కోకము, జీవిత రహస్య పరిశోధనలు మొదలైనవి వున్నాయండీ. రండొక్కసారి కొప్పడక" అన్నాడు వినయంగా. ఎక్కడ దొరికాడురావాడఅనుకొని "అవసరంలేదు లేవయ్యా?" అంటూ గట్టిగా అరిచాడు. ప్రక్కనున్న సమవయస్కుడు పాంటు, షర్టుతోవుండి పక్కున నవ్వాడు. వాడిని చూసో తనను చూసో అనుకొని, మరీ బేజారయ్యాడు. మొఖం పైకెత్తలేకపోయాడు. ఈలోగా వాడు సద్దుకున్నాడు.

కొంచెం సేపాగి తమాయించుకొని బస్సుదగ్గర కెళ్ళి "టైమెంతుదండీ బయలుదేరటానికి?" అన్నాడు, ఒక కాకీచొక్కామనిషిని చూచి. "కండక్టరు లేడులెండి అయినా ముప్పావుగంటవుంది కూర్చోండి ఆకొట్లో...ఏవూరెళతారు?. దగ్గరటిక్కెట్టు యియ్యరే! సరే, నే నెక్కిస్తాగా. అలా కూర్చోండి" మనస్సు చల్లబడింది. ఫరవాలేదు. మంచివాడులా వున్నాడు—వీడెవడో క్లీనరులా వున్నాడు! కండక్టరనుకొని అవసరార్థానికి "ఏమండీ"! అని సంభోదించాను అనుకొన్నాడు. తన తెలివితక్కువకు, తనకే జాలివేసింది.

కొంచెం స్థాయిచిక్కింది. యిక ఫరవాలేదనుకున్నాడు. చెప్పులు కొంటే బాగుంటుందని అలా అలా బజారు కెళ్ళాడు. అవి నచ్చకపోతే బూట్లు

కొన్నాడు. ప్రక్కనున్నవాళ్ళనుచూచి (తప్పును కొని) లిప్పగా కారుదగ్గరకొచ్చాడు. కొత్తబూట్లు నడిచేటప్పటికి కాళ్లు పుళ్లుపడినవి. యీ దుస్తుల మీద కుంటుతూ నడిస్తే బాగుండదని తట్టెడు బాధతో వోపిగా, సాఫీగా నడిచాడు. దానితో మరీ పెద్దపుళ్ళయినాయి. ముందీబాధ ఎక్కువైంది.

అక్కడే పువ్వుల దుకాణంవుంటే వెళ్ళాడు. దోమల్లా ఒకటే రొద! "వంద వేడండీ! ఒకటో రకం పూలు." దగ్గరకు రమ్మంటే, నాదగ్గరకు ఎరిగున్నవాడులా ప్రతివాడు చిరునవ్వు! "ఇదే మన్నా లేలిక వ్యవహారమా?" అనుకుని ముక్కుకు సూటిగా వున్నవాడిదగ్గరకు వెళ్ళాడు. తన సెవ రన్నా చూస్తున్నారేమో? అత్తవారిపూరునుంచి చాలామంది వస్తారే. ఇప్పుడు వద్దంటే—వీడేమంటాడో? ఎలాగూ కొట్టుముందు నుంచున్నాంగా. చూచేవుంటారు. "ఐదొందలు" అంటూ చేతికందించాడు. బుట్టెడు పొట్లాం అయింది. ఇన్నెవరియ్యమన్నారో? వాడిసొమ్మేంపోయింది. ఇక వీడితో యుద్ధానికిదిగితే లాభంలేదు. తియ్యమంటే ఆలస్యమౌతుంది. అవి తీసుకుని కారుదగ్గరకు చేరుకున్నాడు. ఇంకా కారు కండక్టరు రాలేదు. కారు ఖాళీగావుంది. అందువల్ల పక్కకొట్టువద్ద నుంచున్నాడు. అంతలో "కేలెండర్సు" వాడు మళ్ళీవచ్చి "బూట్లిప్పుడే కొన్నారా బాబుగారూ!" అతనెప్పుడొచ్చాడో తను చూడలేదు. చూస్తే తప్పుకునేవాడే. వదిలిచావడు అనుకొని "ఇప్పుడేకొన్నాను" అన్నాడు బెట్టుగా. "ఈ బూట్లు కొన్నారేమండీ, బెట్టుకొనక?...ఐనా, ఎవరియిష్టం వాళ్ళదిలే. ధరెంతండీ"— దరిద్రుడు మళ్ళీ తటస్తపడ్డాడు. వీడికి చెప్పేదేమిటనుకుని పక్కకు తిరిగేప్పటికి ఇందాకటి సమవయస్కుడు సరసనే వున్నాడు. "చచ్చాంరా" అనుకుంటూ "పదిహేడున్నర!" అన్నాడు. "అబ్బో! చాలా ధరండీ! ఆ ధరకి మంచిబూట్లే వచ్చేవిగా. కొత్తవాళ్ళను చూచి మోసపుచ్చాడు"—అనుకుంటూ వెళ్ళిపోయాడు.

"వెధవ! కొత్తవాడినిచేసి మోసపుచ్చాడట. కాళ్ళపురు అంతకన్నా తక్కువకి తెస్తాడేమిటి బోడి!" అనుకుంటూ కారువైపు చూసేసరికి కారు నిండీవుంది. ఆశ్చర్యపోయి తత్తరపాటుతో త్వరగా వెళ్ళాడు. "కండక్టరు టిక్కెట్లు ఆక్కడిస్తున్నారండీ" అన్నాడొకాయన కారులోంచి, స్థలం చూపిస్తూ. తీరాఅక్కడికి వెళ్లేప్పటికి దగ్గర టిక్కెట్లియ్యనన్నాడు.

ఒక్కుర్రాడొచ్చి "ఏవూరెళ్తారండి! — నే ఇప్పిస్తాగా. ఇక్కడే వుండండి" అంటూ పైకి వెళ్లాడు. అంతకన్నా చేసేది మట్టుకేముంది? ఐదు నిముషాల్లో కుర్రాడొచ్చి ఒకప్రక్కకు నుంచుని వినయంగా "మేం నలుగు రన్నదమ్ములమండి. తండ్రి చచ్చిపోయాడు. తల్లుంది; గుడ్డిది. తమ్ముళ్ళు ముగ్గురూ కుంటీ, గుడ్డీ, చెవిటోళ్ళండీ. వాళ్ళందర్నీ నేనే పోషించాలయ్యా. కాస్తకాఫీకి డబ్బులియ్యండి బాబుగారూ!" ఇదీ వరస. వళ్ళు మండిందతనికి. సంసారమేమిటి? కాఫీకి డబ్బులా? ఐనా తనకు టిక్కెట్టు ఇప్పించలేదాయె. "టిక్కెట్టిప్పించు, డబ్బులిస్తా" అన్నాడు. "దానికేం ఫర్వాలేదండీ. ఇస్తాడుగా మనకి" అంటూ కండక్టరుతో "వీరికొక టిక్కెట్టియ్యి" దర్జాగా అన్నాడు. కండక్టరు వీడివంకకూడా చూడలేదు. "ఇస్తాడులెండి! ఏదీ మీదయ"—చేయిజాపాడు. "చిల్లరలేదులేవోయ్; టిక్కెట్టిచ్చాక ఇస్తాను" అన్నాడు. "ఎందుకండీ, నే మారుస్తాగా కండక్టరు దగ్గర" అన్నాడు అందుకోబోయినట్లు. ఈసారి మండిపోయి ఇంకోవైపు తిరిగేటప్పటికి, వాడు వెళ్ళిపోయాడు.

ఒకటిక్కెట్టు ఖాళీగా వుంది. ఇంకా రెండు నిముషాలుంది, బయల్దేరటానికి. కండక్టరు కారు వద్దకు వచ్చాడు. వీరికొక టిక్కెట్టియ్యమంటున్నాడు వాడు. "అరె! దగ్గర టిక్కెట్టియ్యటల్లేదు" అన్నాడు కండక్టరు. "మాష్టారూ! మీరు ఎక్కండి కారు" అన్నాడు వాడు. అర్థంకాలేదు జనార్దనరావుకి. ఎక్కాడు. "మరి—ఎంతవరకిస్తావు టిక్కెట్టు?" అన్నాడు వాడు బరోసాగా. "ఇరవై మైళ్ళ లోపు యియ్యటంలేదు" అని కండక్టరన్నాడు. "సరే, రాయి" అంటూ "ఇచెయ్యండి" అన్నాడు జనార్దనరావుని. తెల్లముఖంవేసి "ఎంత" న్నాడు. చీటీ అందిస్తూ "ముప్పావలా" అన్నాడు కండక్టరు. ఇచ్చేశాడు.

కారు బయల్దేరింది. "కాఫీకి డబ్బులు..." అన్నాడు కాకిచొక్కా. "ఓరి వీడిదుంప తెగ" అనుకుంటూ బేడయిచ్చాడు. 'బేడేమిటిమాష్టారూ?'

బీడీలకో" అన్నాడు ముఖం ఇంకోవైపు పెట్టి. చచ్చినట్టు ఇంకో అణాకూడా ఇచ్చి బరువుగా కూలబడ్డాడు కారులో. పదిగజాలు పోయాక డ్రైవరు కారు ఆపి 'క్లీనర్ ఎక్కడా?' అన్నాడు. వాడెవడో సీటుగా తయారై అప్పుడే వచ్చాడు. "అయితే ఇందాకటివాడు క్లీనరు కాదన్నమాట?" అనుకుంటూ చూస్తున్నాడు జనార్దనరావు.

పదినిముషాల్లో బస్సు తను దిగే చోటికెళ్ళి ఆగింది. దిగాడు. తను ఇంటిదోవ పట్టాడు.

బస్సు చార్జీ, క్లీనర్ అనుకున్న మోసగాడి కిచ్చిందీ కలిసి అణాతక్కువ రూపాయి. ఆ డబ్బులతో సైకిల్ రిక్షామీద ఎప్పుడో హాయిగా యింటికి వెళ్ళిపోను. తనమీద తనకే రోతవేసింది. అన్నీ తెలివితక్కువ పనులే! బుట్టెడు చామంతి పూలా? చెప్పులు కొందామని వెళ్తే బూట్లా!

ఆలోచించుకుంటూ అత్తవారింటికి జేరాడు. తన శ్రీమతి కాళ్ళకు నీళ్ళియిస్తూ "ఏమిటీ అవతారం" అంది వెటకారంగా. "రామ రామ" అనుకున్నాడు మనస్సులో. ఇక ఎప్పుడూ ఇలా రాకూడదనుకున్నాడు. త్వరత్వరగా బట్టలు విడిచి మామూలుగా చొక్కా, లుంగీ వేసుకున్నాడు. "ఇప్పుడెంత బాగున్నారండీ!"అంటూ పాట పాడినట్లు మాట్లాడింది ఆవిడ. "ఎంతమంచిదీ" అనిపించిందతనికి.

పువ్వులపొట్లాం విప్పుతూ, "దారిలో దూడలు వెంటపడలే" అంటూ కిలకిలా నవ్వింది. తనూ నవ్వాడు. ఆమె కొంటెగా నవ్వింది. జనార్దనరావు తెల్లబోయాడు.

---

కథానిక

# మానవుడు_రాఘవులు

బి. రామనాథ్

ఆ రోజు ఆఫీసరుగారి అబ్బాయి పుట్టినరోజు. బంగళా అంతా అలంకరించారు. అబ్బాయిగారి స్నేహితులందరూ వచ్చారు. ఆఫీసరుగారూ, వారిసతీమణీ ఆ రోజు చాలా ఆనందోత్సాహాలతో విందుఏర్పాట్లు చేయించారు. రాఘవులు ఆ రోజు అసలు యింటికి వెళ్ళకుండా బంగళాలోనే ఉండిపోవలసి వచ్చింది. తోరణాలు వాకిళ్ళకు కట్టనూ, రంగుకాగితాలు కత్తిరించి అలంకరించనూ, విందుకు కుర్చీలూ టేబుల్సూ శుభ్రంగా తుడిచి సిద్ధం చేయనూ—రాఘవులు ఆ రోజు ఒక్కక్షణం కూర్చోలేదు. చిన్నబ్బాయిగారి పుట్టినరోజు పండగంటే అతనికీ సంబరంగానే ఉన్నది.

అతిథులంతా వచ్చారు. ఆఫీసరుగారే స్వయంగా ఆహ్వానించి లోనికి తీసుకువెళ్తున్నారు. ఎంతమంది పిల్లలొచ్చారో! వరండా అంతా, వచ్చిన పిల్లల పాదరక్షలతో నిండిపోయింది. రకరకాల స్లిప్పర్లూ—రంగురంగులబూట్లూ—చిన్న చిన్న చెప్పులూ!—రాఘవులు వరండా చివర గోడ కానుకుని కూర్చుని చూస్తున్నాడు. ఎన్నిచెప్పులు! ఎన్నిరకాలు! ఎంతబాగున్నయ్!

రాఘవులు అలాగే గోడకానుకుని ఆలోచిస్తున్నాడు...ఒక్కసారి తన పాదాలు చూసుకున్నాడు...చెప్పులులేని ఆ పాదాలు దుమ్ముతో మట్టితో కప్పుకుని పోయాయి. రాళ్ళరోడ్లమీద—ఎండలో—వానలో తిరిగి తిరిగి అరిగిపోయాయి! అయినా చెప్పులు కొనుక్కోడానికి కుదరకుండా వచ్చింది. చివరకి రంగడికికూడా తను చెప్పులు కొనలేకపోయాడు.

వాడు — ఆ పసివెధవ — అలాగే అవస్థపడుతూ మండుటెండలో వీధులన్నీ తిరిగి ఐస్ ఫ్రూట్ అమ్ముకుంటూ తనకి కొంతసహాయంగా ఉన్నాడు. నిప్పులుచెరిగే ఎండలో—కాళ్ళు మాడిపోయే ఆ ఎండలో వాడి లేతపాదాలు ఎంతగా కందిపోతున్నాయో! ఎంతకాల్తున్నాయో!

రోజూ ఇంటిదగ్గర వాడితల్లి పోరుతూనే ఉన్నది—"పిల్లవాడికి చెప్పులు కుట్టించవయ్యా!" అని. 'కుట్టిద్దాంలెద్దూ!...కాస్త చేతిలో చూసుకోవద్దూ?' అంటూ తనే రోజులు గడుపుతున్నాడు. మొన్న ఒకరోజు—ఎదురు దెబ్బ తగిలి, వాడి బొటనవ్రేలంతా రక్తంతో తడిసిపోయింది. ఏడుస్తూ